# బుద్ధి!

కప్పగంతుల మల్లికార్జునరావు



'అమ్మా... మీరు వెనక్కి జరగాలి.'

'అయ్యా ! బాబు .. మీరు ముందుకు జరగాలి.'

కరిచినట్లు అరుస్తున్నాడు కండక్టర్ వొక్కరూ కదలలేదు.

'ఇంకా ఎక్కడికి జరగమంటావ్ !' ఎవరో అన్నారు మెల్లగా. ఆ మాట ప్రయాణీకుల రణగొణ ధ్వనిలో కల్సిపోయింది.

'ఏమ్మా .. మీక్కాదూ చెప్పటం ? అలా చూస్తూ నిల్చుంటారేం ? ముందు కొక్క అడుగేస్తే బోలెడంత జాగా. బయట వున్న పేసెంజెర్స్ ఎక్కాలా ? అమ్మాయ్ . అలా వెనక్కి చూస్తూ నిల్చుంటావ్ ? వో అడుగు వెనక్కి వెయ్యి. ఇదిగో పెద్దయ్య ..నువ్వేమిటి? అలా ముందుకు చూస్తూ నిల్చుంటావే ? వో అడుగు వెయ్యవయ్యా ... ఆ .. అది బాబూ . మీరు జరగండి . అమ్మా... మీరు సర్దుకోండి'

ఆ అమ్మాయి వో అడుగు వెనక్కి వేయక తప్పలేదు.

ఆ పెద్దమనిషి వోఅడుగు ముందుకు వేయక తప్పలేదు.

ముందు డోర్ నుంచి స్త్రీలు .. వెనక డోర్ నుంచి పురుషులు . ఎక్కాల్సిన వాళ్లంత ఎక్కేసేరు.

అప్పడాల్లాగ అతుక్కుపోయి వున్నారు జనం ఎండాకాలం చమటలు కారిపోతున్నాయి.

'రైట్ .. రైట్.. '

సిటీబస్సు కదిలింది లోపలి జనం వూపిరి పీల్చుకొన్నారు.

'టికెట్ . . టికెట్ '

టికెట్లు 'కట్' అవుతున్నాయి. చిల్లర డబ్బుల గలగలలు విన్పిస్తున్నాయి.

వెనక డోర్ దగ్గర జనం మధ్యలో నిలబడ్డ అతని దృష్టి అంతా పెద్దాయనకు ముందున్న ఆ అమ్మాయి మీదనే వుంది. తలకాయల మధ్యలో నుంచి చూస్తున్నాడు. మధ్య మధ్యలో ఏవో సైగలు చేస్తున్నాడు.

'నాయనా హీరో. బస్సు ప్రేమలస్సి బస్సులే. ఫుట్‌బోర్డు మీదున్న పేసెంజెర్స్ చస్తున్నారు పాపం యిందాకటి నుండి చూస్తున్నాము. వొక్క అడుగు ముందుకు వెయ్యమంటే మొద్దులా నిలబడ్తావేం ? జరుగు ముందుకి,' అని అంటూ ఎవరో పేసెంజర్ అతడిని ముందుకు నెట్టేడు.

అతను ముందుకు తూలి జనం మీద పడ్డాడు ఆ తూలుడు తూలుడు ముందున్న స్త్రీల దాకా వో పుయ్యాల వూపుకు కారణమయింది.

'నెట్టకండయ్యా బాబూ. యిక్కడ ముందు ఆడవాళ్ళున్నారు.'

అందమైన ఆ అమ్మాయి వెనక నిలబడ్డ

ఆ పెద్దాయన ఆ అమ్మాయి మీదికి తూలిపడి సర్దుకొని లేచి వెనక్కి తిరిగి జనంతో అన్నాడు.

'అమ్మాయ్. నువ్వు పైన హేండిల్ పట్టుకో లేకపోతే పడిపోతావ్ ?' అని అన్నాడు ఆ అమ్మాయితో.

ఆ అమ్మాయి ఆ పెద్దాయన మాటల్ని విన్పించుకొన్నట్లు కన్పించలేదు అందమైన ఆమె మొహంలో ఏదో ఆందోళన. ఆరాటం ఆమె చూపులన్నీ వెనక్కే వున్నాయి

'ఒరేయ్ ! ముసలాడి కళ్లు కప్పి, పిల్ల వెనక నిలబడ్డ ఆ హీరోగాడితో 'లౌ' ఆడుతున్నది రోయ్ ! దాని చూపులు చూడు ఫేస్‌లో ఎక్స్‌ప్రెషన్ చూడు ఏదో మెసేజ్ కన్‌వే చేస్తున్నట్లు లేదూ ?' సీటులో కూర్చొని ఆమెనే చూస్తున్న యువకులిద్దరు గుసగుస లాడుకొంటున్నారు

మార్కెట్ . హోటల్ రంభ . థియేటర్ తిలోత్తమ

బస్ స్టాప్‌లు వస్తున్నాయి పోతున్నాయి ఎక్కేజనమేకాని దిగేజనం లేరు.

ఉన్నట్లుండి వెనక గేటు వద్దనున్న ఆ యువకుడు జనాన్ని తోసుకొని ముందుకు రావటం ఆరభించాడు.

'ఏంటయ్యా. తోస్తావ్? యిందాకటిదాకా వెనకవాళ్లకి అడ్డంగా నిలబడ్డావ్ ? యిపుడు ముందున్న మమ్మల్ని తోసుకుపోతున్నావ్ ? ఎక్కడికెళ్తావ్ ?'

'బస్సులో ప్రేయసి దగ్గరికేమో! ఇందాకటి నుంచి 'బీట్' కొడుతున్నాడుగా ? సిగ్నల్ అంది వుంటుంది '

అతను ఎవరి మాటల్ని పట్టించుకోటం లేదు ముందుకు ... ముందుకు .. తోసుకు . తోసుకు . . పద .. పద ..

ముందుకొచ్చాడు. అతనికి ఆ అమ్మాయికి మధ్యన పెద్దాయన మాత్రమే ఇప్పుడు అడ్డం పెద్దాయనను పక్కకు నెట్టి ముందుకు తోసుకు పోబోయాడు.

కానీ పెద్దాయన గట్టివాడే. గోడలాగా నిలబడి అంగుళం కదల్లేదు

'ఏమిటోయ్ ? ఏమిటా వూపు ? ఆహా — నాకు తెలీకడుగుతాను—ఎక్కడికిట ఆ పరుగు ? ఆ తోపుడేమిటి? ఇందాకటినుంచి చూస్తున్నాను. నీ అల్లరి వేషాలేమిటి ? ముందున్నవాళ్లంతా ఆడవాళ్లు కదా? వారిని కూడా తోసుకుపోదామనే? ఆహా — నువ్వసలు మర్యాదవున్న మనిషివేనా అని ?' ఝాడించేసేడా పెద్దమనిషి యువకుడిని

'భలే భలే ... భలే అడిగారండీ' అనుకొన్నారు చాలామంది.

'మర్యాదా ? మీరు ఏ మాత్రం మర్యాదస్తులో యిందాకటినుంచి చూస్తూనేవున్నాలెండి ఎందుకు ఏళ్లొచ్చాయ్ ? కాల్చుకుతిననా ? ఛీ సమయం కల్సివచ్చిందికదాని మీ యిష్టం వచ్చినట్లు ప్రవర్తించటమేనా ? మీ సంగతి తేల్చుకొందామనే వచ్చాను. యిప్పుడు చేయి వెయ్యండి మీ అంతు తేలుస్తాను' అతను కోపంగా అన్నాడు అంటూ పెద్దమనిషిని అమాంతం వెనక్కి నెట్టేసి ఆ అమ్మాయి వెనక స్థానాన్ని తను ఆక్రమించాడు.

బస్సు ఏదో స్టాప్‌లో ఆగింది

'చూచారుటండీ — అతగాడి దౌర్జన్యం ? పెద్దమనిషిని — నన్ను పట్టుకొని ఎన్నెన్ని మాటలన్నాడో విన్నారుకదా? ఆ పిల్లను నేనేమో చేసేనుట ! యితను ఆమెను నా నుంచి రక్షించటానికి వచ్చిన హీరోలా నన్ను నెట్టేసి ఆ అమ్మాయి వెనకనిలబడ్డాడు నా వయసేమిటి ? ఆ పిల్ల వయసేమిటి ? నా కూతురి లాంటిదే యితనేమన్నా మర్యాద వున్న మనిషేనా అని ! యితగాడి దౌర్జన్యం యిలా జరిగిపోవల్సిందేనా అని ! అబ్బాయ్ నువ్వు మర్యాదగా నా స్థానాన్ని నాకిచ్చి వెనక్కివచ్చి నిలబడ్తావా లేదా ?''

'నిలబడాల్సిందే . నిలబడాల్సిందే' యువ పాసెంజర్లు పెద్దమనిషికి సపోర్ట్‌గా అరిచారు

'అది కాదండీ ' ఏదో చెప్పబోయాడు

'నువ్వేం చెప్పనక్కర్లేదు మేం అంతా చూస్తూనేవున్నాం నువ్వు ఆ అమ్మాయికి సైగలు చేయటం అదీ పైగా పెద్దమనిషిని పట్టుకుని అన్నిమాటలంటావా ? అసలు వెనక వున్నవాడివి—తోసుకొని ఆడాళ్లవరకు వచ్చేపనేమిటి నీకు? వచ్చివచ్చి అందమైన ఆ అమ్మాయి వెనక నిలబడటంలో అర్థం ఏమిటి ? ఎన్ని గుండెలు నీకు ? అమ్మో . ?'


తలా వో మాట అనసాగేరతడిని


అతనొక్కడు, యువతల అనేక గొంతులు


అయినా అతను చలించలేదు ఆ అమ్మాయి వెనక స్థానాన్ని వదలలేదు ఏదో మాట్లాడుతున్నాడు కానీ రణగొణధ్వనిలో విన్పించటంలేదు

'రైట్ . రైట్ ' కండక్టర్ అరిచాడు ఎవరో కండక్టర్‌తో చెప్పి బస్సును కదలకుండా ఆపించారు.

'వాడి అంతు తేల్చుకోవాల్సిందే యివాళ ఎంత దౌర్జన్యం ? పబ్లిక్‌గా సిటీబస్‌లో అమ్మాయిని పట్టుకొని. .'






జనానికి ఆవేశం, పట్టుదల పెరిగాయి.

ఆ అమ్మాయి కలగజేసుకొని ఏదో చెప్పబోయింది. కానీ విన్పించుకొనే వారేరీ ?

నలుగురూ ఆ యువకుడిని యువతలకి లాగారు.

తలా వో తోపు—తలా వో దెబ్బ. అతను బస్సులోనే పాసెంజర్స్ కాళ్ళదగ్గర పడ్డాడు

'ఇట్లాంటి వాళ్లను యిలా తన్ని వదిలేస్తే లాభంలేదు బుద్ధి చెప్పాల్సిందే, పోలీసులకి పట్టియ్యాల్సిందే' ఆడవాళ్ళు మగవాళ్లకు సపోర్టుగా అరిచారు

'ముందు రోడ్‌సైడ్ రోమియోగాడిని బయటికి లాగండి.'

నలుగురూ చేరి అతడిని లాగబోయారు

హఠాత్తుగా ఆమె వచ్చి అతని చేయి



పట్టుకొంది కళ్ళతోనే పేసెంజర్స్‌ని అతడినేం చేయవద్దని వేడుకొంది

'రోమియోకి సపోర్టు వచ్చిందిరోయ్ జూలెట్ ! ఆహా—ప్రేమ !' అంతా ఫక్కున నవ్వేరు.

'అయ్యా ఆమె నా ప్రేయసి కాదు నా భార్య' అరిచాడతను

'భా ర్యా. !!'

'ఆమె ముందు నుంచి బస్సెక్కింది నేను వెనకనుంచి ఎక్కేను ఆమె కోసమని కూడా నేను తీసుకొన్న రెండు టిక్కెట్లివిగో'

'మరి ఆ మాట ముందే చెప్పవచ్చుగా ? పైగా బస్సెక్కిన దగ్గిరనుంచి ఆ సైగలేమిటి? నువ్వు తన భర్త అని ఆ అమ్మాయి అయినా చెప్పవచ్చుగా ? ఏమ్మా ?'

అతను తల వంచుకొన్నాడు — ఆమె అమాయకంగా అతడినే చూస్తోంది.

"భార్యాభర్తలని తెలియక ఎన్ని మాటలను కొన్నాం పాపం — ఆ అమ్మాయి యిప్పుడెంత బాధపడుతున్నదో ?"

'ఆ బాధ పొనక్కర్లేదండీ ఆమె బాధ పడదు ఎందుకంటే మీరనుకొన్నవి ఆమెకు విన్పించవు తనుకొన్నవి మీకు చెప్పలేదు ఎందుకంటే ఆమె మూగది కూడా కనుక'

'ఆ !'

'రైట్ .. రైట్' బస్ కదిలింది

'అయితే మొదట్లోనే మీరు ఆమె దగ్గరికి రావచ్చుగా ? చివర్లో అంత హడావుడిగా అందరినీ తోసుకొంటూ రావటందేనికి ?'

'మొదట్లో ఆమెను రక్షించుకోవల్సిన అవసరం వస్తుందనుకోలేదండీ అంచేత ఆమెను గమనిస్తూ వున్నాను కానీ వున్నట్టుండి పరిస్థితి మారింది. ఆమె తనకి నా రక్షణ కావాలని సిగ్నల్‌కూడా యిచ్చింది అప్పుడు నాకు జనాన్ని తోసుకొని ముందుకు రాగల బలం వచ్చింది'

'రక్షణా ! యింతమంది జనం వుండగా ఆమెకేం ఆపదొచ్చింది ? మేం చూస్తూనే వున్నాంగా ?'

'మీరు కానీ, నేను కాని, మనుష్యుల బుద్ధిల్ని చూడలేం కదండీ ?'

'అంటే —? ఆమెపట్ల ఎవరైనా అనుచితంగా ప్రవర్తించారంటావా ? ఆమెకు చుట్టుపక్కల ఎవరగా వయసులోవున్నవారుకూడా లేరే అటు ఆడవాళ్లు ! యిటు యీ పెద్దాయన ! యింతకన్నా రక్షణ ఏముంది ?'

అతను నవ్వేడు పెద్దమనిషి వైపు చూచాడు

బస్సు ఆగింది

'మీ ప్రశ్నకు సమాధానం ఆ పెద్దమనిషినే అడిగి తెల్సుకోండి నేను నిజం చెప్పినా మీరు నమ్మకపోవచ్చు రా జ్యోతీ వెళ్దాం'

ఆ యువకుడు ఆమె చేయి పట్టుకొన్నాడు

ఆమె రెండడుగులు వేసి పెద్దమనిషివద్దకొచ్చింది ఆయన్ని చూడగానే ఆమె కళ్లల్లో నీళ్లు తిరిగేయి అంతలోనే మొహం కూడా అసహ్యంతో నిండిపోయింది

'ఛూ' అంది ఆ వొక్క మాటలో ఆ స్త్రీ గుండెల్లోని అసహ్యమంతా వ్యక్తమయింది

వాళ్లు బస్సు దిగపోయారు బస్సు మళ్లీ కదిలింది

జనం పెద్దాయనవైపు చూచారు,

తలక్రిందులుగా నిల్చున్న మనిషిగా కన్పించాడా పెద్దమనిషి !

★